క్లుప్తంగా

కొనసాగుతున్న నిరసన

సామర్లకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సచివాలయ సిబ్బంది చేపట్టిన నిరసన కార్యక్రమం శుక్రవారానికీ కొనసాగుతోంది. గాంధీ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమాల్లో వారు నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. మహాత్మా మా ఘోష విను.. అనే కార్యక్రమంతో వాట్సాప్ స్టేటస్ పెట్టి నిరసన తెలుపుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: పట్టణంలోని పిఠాపురం రోడ్డులో ఉన్న సబ్ స్టేషన్‌లో మరమ్మతులను పురస్కరించుకుని శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎస్‌డీఎస్ ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కారణంగా బ్రౌన్‌పేట, గణేష్ కాలనీ, సీతారామకాలనీ, కుమ్మరవీధి, పాత తహసీల్దార్ కార్యాలయం, బళ్ల మార్కెట్, వీర్రాఘవపురం, తెలుకులపుంత, పెన్షన్ లైన్, సామాజిక ఆరోగ్య కేంద్రం ఏరియా, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, గోలివారివీధి, ఇస్మాయిల్ నగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, సామర్లకోట, పెద్దాపురం వాటర్ వర్క్స్, భీమేశ్వర స్వామి టెంపుల్, స్టేషన్ సెంటర్, సత్యనారాయణపురం, సంపెంగ తోట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఆకట్టుకున్న కర్రసాము

కొత్తపల్లి: మండలంలోని కుతుకుడుమిల్లి మార్కెట్ వీధిలో ఉన్న బేతాళ స్వామి సంబరాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి చిత్రపటాన్ని పల్లకీలో ఉంచి కొత్తపల్లి, వాకతిప్ప గ్రామాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన కర్రసాము విశేషంగా ఆకట్టుకుంది. ఇటువంటి కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని పలువురు పేర్కొన్నారు.

ట్రస్టు బోర్డు ప్రమాణ స్వీకారం


సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఈఓ

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరీదేవి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కంటే జగదీష్ మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దేవదాయ శాఖ పాలక మండలిని నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో గురువారం సాయంత్రం ఆలయంలో సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా కంటే జగదీష్ మోహనరావు, చీమలకొండ వీరభద్రప్రసాదరావు, తాతపూడి అరుణ్‌వంశీ, గొర్తి సత్యనారాయణ, అలోక్ చంద్రజైన్, కంచర్ల సుష్మమోహిణి, కొండపల్లి సత్యవాణి, మందపల్లి భానువెంకటపద్మ, బాడితమాని లక్ష్మి, గోనిపాటి బుల్లెమ్మ, ఎక్స్ అఫీషియో సభ్యునిగా సన్నిదిరాజు వెంకటరమణతో ఈఓ నీలకంఠం ప్రమాణం చేయించారు. అనంతరం ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కంటే జగదీష్ మోహనరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క స్వైరవిహారం

పెద్దాపురం(సామర్లకోట): పెద్దాపురం పట్టణంలో పిచ్చి కుక్క స్వైరవిహారం చేసినట్టు కౌన్సిలర్ రాఘవ, మాజీ కౌన్సిలర్ గంగ తెలిపారు. శుక్రవారం సుమారు పది మందిపై విరుచుకు పడిందని చెప్పారు. కుక్కలను నియంత్రించడానికి నిబంధనలు అడ్డు వస్తున్నాయని మున్సిపల్ అధికారులు చెబుతున్నారని, ప్రజల ప్రాణాలు పోతున్నా.. మున్సిపల్ అధికారులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదన్నారు.

సిరిపల్లె నవ్వు

'సంకల్పం' దృఢంగా ఉంటే ఏ కార్యమైనా సాధ్యమై తీరుతుంది. దీనినే విశ్వసించారు చేబ్రోలు గ్రామస్తులు. ప్రజా సంకల్ప యాత్ర చేపట్టిన వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద తమ సమస్యలను ఏకరువు పెట్టారు. 'నేనున్నానంటూ' భరోసానిచ్చిన ఆయన.. సీఎంగా ఉన్న సమయంలో ఆ గ్రామ తలరాతనే మార్చేశారు. ఏకంగా రూ.120 కోట్లతో.. చేబ్రోలు గ్రామంలో సిరులు కురిపించి ప్రతి ఒక్కరి మోములో నవ్వులు పూయించారు.

- స్వచ్ఛ గ్రామ పంచాయతీగా చేబ్రోలు
- రూ.120 కోట్లు కేటాయించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- రూపురేఖలు మార్చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పిఠాపురం: జాతీయ రహదారిని అనుకుని ఓ చిన్న గ్రామమది. చారిత్రాత్మకంగా పేరొందిన ఆ గ్రామం గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు. మాగాణి, మెట్ట భూములు కలిగి వ్యవసాయాధారిత గ్రామం కావడంతో పాడిపంటలతో ఉంటుంది. దేశంలో ఎక్కడా పండని పొట్టి మిర్చికి కేరాఫ్ అడ్రస్ ఈ గ్రామం. పత్తి, పట్టు, మర్చి, ఉల్లి వంటి ప్రధాన వాణిజ్య పంటలకు పుట్టినిల్లు. పూర్వం చెంబుబ్రోలుగా ఉన్న ఈ గ్రామం ప్రస్తుతం చేబ్రోలుగా పిలవబడుతోంది. ఎన్నో ఏళ్లుగా పాలకులు మారుతున్నా ఈ గ్రామ రాత మారలేదు. 2019 సార్వత్రిక ఎన్నికల తరువాత ఈ గ్రామం రూపు రేఖలు ఒక్కసారిగా మారిపోయాయి. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఈ గ్రామం మీదుగా వెళ్లినపుడు ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు.. తమ గ్రామాన్ని అభివృద్ధి చేయాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక కేవలం నాలుగున్నరేళ్లలో చిన్న గ్రామంలో ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా రూ.120 కోట్ల నిధులు వెచ్చించి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. దీంతో గ్రామంలో మౌలిక సదుపాయాలు కలిగి, గ్రామం స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేసింది పంచాయతీ పాలకవర్గం. దీంతో చేబ్రోలుకు జిల్లాలో స్వచ్ఛ గ్రామ పంచాయతీగా అవార్డు దక్కింది.


చేబ్రోలు గ్రామ ఏరియల్ వ్యూ

గ్రామ స్వరూపం

విస్తీర్ణం	19.09 చదరపు కిలోమీటర్లు
జనాభా	15,138
వార్డులు	16
కుటుంబాలు	4144
ఓటర్లు	11,667 మంది
రైతు భరోసా కేంద్రాలు	3
గ్రామ సచివాలయాలు	3
పీహెచ్‌సీ	1
హెల్త్ సబ్ సెంటర్లు	3
పశువుల ఆస్పత్రి	1

మాజీ సీఎం జగన్ చేసిన అభివృద్ధే..



ఎందరో ముఖ్యమంత్రులు వచ్చారు, వెళ్లారు. ఎవరు మా గ్రామాన్ని అభివృద్ధి చేయలేకపోయారు. ప్రజా సంకల్ప యాత్ర ద్వారా వైఎస్ జగన్ మా గ్రామంలో తన కాలిని మోపి.. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. ఆయన సీఎం అయి.. మా గ్రామం రూపురేఖలను మార్చేశారు. ఇలా అభివృద్ధి చేయడం ఎవరితరం కాదు. ఒక చిన్న గ్రామానికి రూ.120 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయడం అంటే మాటలు కాదు. అలా అభివృద్ధి చేయడం ఒక్క వైఎస్ జగన్‌కే సాధ్యం. ఆయన హయాంలో మేము ప్రజాప్రతినిధులుగా ఉండడం మా అదృష్టంగా భావించాం. ఆయనకు మా జీవితాంతం రుణపడి ఉంటాం. ఆయన ఇచ్చిన చేయూత, సహకారం వల్లే ఈరోజు మా గ్రామానికి అవార్డు వచ్చింది.

– దొండపాటి లోవతల్లి, సర్పంచ్, గ్రామ పంచాయతీ, చేబ్రోలు

నియోజకవర్గానికి ఇచ్చినన్ని నిధులు



గతంలో ఒక నియోజకవర్గానికి కూడా ఇన్ని నిధులు ఇచ్చేవారు కాదు. అలాంటిది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఒక గ్రామానికి ఇన్ని నిధులు ఇచ్చారు. కుల, మత, వర్గ తేడాలు లేకుండా గ్రామంలో అందరికీ అన్ని పథకాలు అందేలా చేయడం, దీర్ఘకాలిక సమస్యలకు చెక్ పెట్టడం మాకే ఆశ్చర్యం కలిగించింది. అడిగేది తక్కువ అయితే, ఇక అడగాల్సిన అవసరం లేకుండా సమస్యలను అప్పటి ప్రభుత్వమే గుర్తించి అభివృద్ధి చేయడం అనేది చరిత్రలో ఏ ప్రభుత్వం చేయలేదు. వైఎస్ జగన్ మాత్రమే చేయగలిగారు. మండల కేంద్రంతో పని లేకుండా, అన్ని రకాల సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చేశారు. రూ.120 కోట్లకు పైగా ఒక గ్రామానికి అభివృద్ధి చేయడానికి వెచ్చించడం చరిత్రలో నిలిచిపోతుంది. అందువల్లే ఇప్పుడు అవార్డు సాధించేలా చేసింది.

– వులవకాయల నాగలోవరాజు, జెడ్పీటీసీ సభ్యుడు, గొల్లప్రోలు మండలం

శృంగార వల్లభస్వామి సన్నిధిలో ఎస్పీ దంపతులు


జిల్లా ఎస్పీ దంపతులను ఆశీర్వదిస్తున్న ఆలయ పండితుడు

పెద్దాపురం(సామర్లకోట): పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో ఉన్న శృంగార వల్లభస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన దంపతులకు ఆలయ మర్యాదలతో ఈఓ శ్రీనివాసు ఆధ్వర్యంలో పండితులు స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ పండితులు ఎస్పీ దంపతులకు ఆశీర్వచనాలు అందజేశారు.

వేంకటేశ్వరునికి జన్మ నక్షత్ర పూజలు

కరప: యండమూరులో ఉన్న సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజయదశమి రోజున వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులతో వేంకటేశ్వరస్వామి వ్రతాలు చేయించారు. కరప విష్ణాలయంలోని వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు జరిగాయి. పెనుగుదురు, గురజనాపల్లి, వేళంగి, కూరాడ తదితర గ్రామాల్లో స్వామివారికి పూజలు నిర్వహించారు.

అంబరాన్నంటిన బేతాళ సంబరం


వేట్లపాలెంలో బేతాళ స్వామిని ఊరేగిస్తున్న భక్తులు


బేతాళ స్వామిని దర్శించుకుంటున్న దవులూరి దొరబాబు, ఇతర ప్రముఖులు

- ముగిసిన ఉత్సవాలు
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో నిర్వహించే బేతాళ సంబరం అంబరాన్ని తాకింది. శరన్నవరాత్ర ఉత్సవాల ప్రారంభం సందర్భంగా బేతాళ స్వామి ఆలయంలో 11 రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాలు ముగింపు, విజయదశమిని పురస్కరించుకుని గురువారం భారీఎత్తున బ్యాండ్ మేళం, బాణసంచా కాల్పులతో బేతాళ సంబరం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దవులూరి దొరబాబు, పారిశ్రామిక వేత్తలు బొద్దు వెంకటరమణ చౌదరి, గుణ్ణం చంద్రమౌళి తదితరులు స్వామిని దర్శించుకున్నారు. సంబరాన్ని తిలకించడానికి దూర ప్రాంతాల నుంచి సైతం అధిక సంఖ్యలో జనం తరలిరావడంతో గ్రామం సందడిగా మారింది. ప్రతి ఇంట్లో పిండి వంటలు ఘుమఘుమలాడాయి. ఆలయం నుంచి గ్రామ వీధుల మీదుగా ఊరేగింపు కొనసాగింది. ఆయా ప్రాంతాల్లో ఉన్నవారు స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముగింపు ఉత్సవాన్ని పురస్కరించుకుని బేతాళ స్వామిని గ్రామ శివారుకు తీసుకెళ్లి మట్టిలో పూడ్చి వేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు కొండపల్లి జగ్గారావు, సూరన్నచౌదరి, కాకర్ల గంగాధర్, గోలి శ్రీరామ్, సురేష్, గద్దె సాయిరాం ఆధ్వర్యంలో రాత్రి భారీఎత్తున బాణసంచా కాల్చారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు బందోబస్తు పర్యవేక్షించారు. పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు నిడదవోలు సురేష్‌చౌదరి, మండల ఉపాధ్యక్షుడు నిడదవోలు రాంబాబు, నాయకులు వల్లూరి పెద్ద, పాలకుర్తి రామకృష్ణ, వెగుళ్ల వెంకటరమణ, పాలచర్ల వెంకట్రావు, రాయుడు శ్రీను, మాకిరెడ్డి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆయుధ పూజ


ఆయుధ పూజ నిర్వహిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం: విజయ దశమి పర్వదినమైన గురువారం జిల్లా ఎస్పీ బిందుమాధవ్ సతీసమేతంగా ఆయుధ పూజ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ పూజలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణలో సేవలందిస్తున్న వివిధ ఆయుధాలను సమర్పించారు.

'కూటమి' మోసాలను ఎండగడతాం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: సూపర్ సిక్స్ అంటూ అధికారంలోకి వచ్చి ఏ ఒక్క పథకాన్ని పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను చేస్తున్న మోసాలపై ఎండగట్టడానికి వైఎస్సార్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. ఏడాదిన్నర పాలనలో ఒక్క హామీని నెరవేర్చని ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని దుయ్యబట్టారు. పార్టీ సీనియర్ నేతలైన గండేపల్లి సత్య వెంకట రామారావు(బాబీ), రావు చిన్నారావు, వడిశెట్టి నారాయణరెడ్డికి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులుగా నియమించడం ఆనందదాయకమని శుక్రవారం ఇక్కడ తెలిపారు. ప్రజల పక్షాన నిలిచే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కూటమి ప్రభుత్వ మోసాలపై నిలదీయడానికి.. ప్రజల పక్షాన పోరాటం చేయడానికి సైనికులుగా పని చేస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రజలు కూటమి ప్రభుత్వ మోసాలను తెలుసుకున్నారని, అందరూ ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని నిలదీయడానికి ఎల్లప్పుడూ వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ అండగా ఉందన్న భరోసా ప్రజల్లో కలిగిందని చెప్పారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజల తరఫున పోరాటాలు చేసి, వారికి మేలు చేయడానికి మరింత కృషి చేస్తామని స్పష్టం చేశారు.


గండేపల్లి బాబీని అభినందిస్తున్న వంగా గీత

పార్టీ అభ్యున్నతికి కృషి : చిన్నారావు

కొత్తపల్లి: తనపై ఉన్న నమ్మకంతో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని రావు చిన్నారావు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్ ఆధ్వర్యంలో రావు చిన్నారావును పార్టీ శ్రేణులు శుక్రవారం వాకతిప్పలో శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ, పార్టీ అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరిస్తామన్నారు. కార్యక్రమంలో వాకతిప్ప సర్పంచ్ పాలాని దొరబాబు, పార్టీ చేనేత విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు గోపి హరిబాబు, మాజీ సర్పంచ్ కర్రి ఏసుబాబు, కుక్కల వెంకటరమణ, సాకా చిన్నబ్బాయి, దున్న చిట్టిబాబు, రావు అశోక్, గుండారపు అప్పాజీ, పొన్నగంటి రామకృష్ణ, పందికి కుమారస్వామి, రాపర్తి శ్రీను, రాజాపంతులు వెంకటేష్, జ్యోతుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చిన్నారావును సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

9న యువజనోత్సవాలు

కాకినాడ రూరల్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా యువజన సర్వీసుల శాఖ(సెట్రాజ్) ఆధ్వర్యంలో ఈ నెల 9న కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు–2025 నిర్వహిస్తున్నట్టు సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. యువతకు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో తమ ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా స్థాయి యువజనోత్సవాలు వేదికగా నిలుస్తాయని చెప్పారు. 15 నుంచి 29 ఏళ్లున్న యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జానపద నృత్యం, జానపద గేయం, కథ రాయడం, కవిత్వం, పెయింటింగ్ వంటి పోటీలతో పాటు, ఇన్నోవేషన్ ట్రాక్లో సైన్స్ మేళా తదితర అంశాలు ఉంటాయని వివరించారు. ఆసక్తి ఉన్నవారు రమణయ్యపేట ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులోని సెట్రాజ్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. వివరాలకు 98411 13065 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు

- జీఎస్టీ జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి

కాకినాడ రూరల్: తగ్గిన జీఎస్టీతో పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని జీఎస్టీ జాయింట్ కమిషనర్ డి.శ్రీలక్ష్మి అన్నారు. జిల్లా వినియోగ సమాచార కేంద్రం, కాప్కో ఆధ్వర్యంలో శుక్రవారం తన చాంబర్‌లో ఆమె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జీఎస్టీలో వచ్చిన మార్పులు పేద వర్గాల ఆర్థిక వృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. జీఎస్టీ సూపర్ సేవింగ్ క్యాంపెయిన్ ద్వారా ప్రజల్లో అవగాహన తెస్తున్నామన్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా ఆర్థిక సాక్షరత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ తోట లలిత, జిల్లా సమాచార కేంద్రం ఇన్‌చార్జి శివమూర్తి, జిల్లా వినియోగదారుల రక్షణ కౌన్సిల్ సభ్యుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కాకినాడలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాయింట్ కమిషనర్ శ్రీలక్ష్మి

బోట్‌క్లబ్: జీఎస్టీ–సూపర్ సేవింగ్ ప్రచారంలో భాగంగా ఏపీ డబుల్ బెనిఫిట్స్ ప్రచార పోస్టర్‌ను కార్పొరేషన్ కమిషనర్ భావన స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ తగ్గింపు మహిళా సాధికారతకూ దోహదపడుతుందన్నారు.

వైభవంగా ముగిసిన దసరా ఉత్సవాలు


పంచారామ క్షేత్రంలో చండీహోమం నిర్వహిస్తున్న పండితులు


ప్రత్యేకాలంకరణలో పురుహూతికా అమ్మవారు


విజయ దుర్గాదేవిగా పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి


పంచారామ క్షేత్రంలో వెండిచీర అలంకరణలో అమ్మవారు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలు గురువారంతో ఘనంగా ముగిశాయి. విజయ దశమి సందర్భంగా గురు, శుక్రవారాల్లో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి విజయదుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వడంతో వేలాదిగా అమ్మవారిని దర్శించుకున్నారు. పురుహూతికాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు, స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాదగయ పుష్కరిణిలో అమ్మవారి తెప్పోత్సవం కనుల పండువగా జరిగింది. ఆలయ అర్చకులు శమిపూజ నిర్వహించారు. కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లోని కనకదుర్గ అమ్మవారి ఆలయాలకు దశమి సందర్భంగా భక్తులు పోటెత్తారు. భక్తులు రాజరాజేశ్వరీదేవి. పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాలు ముగియడంతో శనివారం అన్ని గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపులు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో శరన్నవరాత్ర ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిని చివరి రోజు రాజరాజేశ్వరిగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి వెండి చీరతో అలంకరణ చేశారు. ఆలయ ప్రాంగణంలో చండీహోమం జరిగింది. మధ్యాహ్నం జమ్మి చెట్టు వద్ద ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు శమిపూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామోత్సవాన్ని ఈఓ ప్రారంభించారు.


కొత్తపల్లిలో అమ్మవారిని రథంపై ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా అమ్మవారి ఊరేగింపు

కొత్తపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా కనకదుర్గాదేవి అమ్మవారిని గురువారం ఘనంగా ఊరేగించారు. స్థానిక ధర్మశాస్తా ఆలయంలో ఉన్న కనకదుర్గాదేవి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, వాకతిప్ప, ఉప్పాడ, కొండెవరం, కోమరగిరి, గొర్స, యండపల్లి తదితర గ్రామాల్లో ఉత్సవాల ముగింపు సందర్భంగా అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. కోనపాపపేట నుంచి ఉప్పాడ శివారు సబ్బంపేట సమీపంలో ఉన్న తీర ప్రాంతంలో అమ్మవారి విగ్రహాలను భక్తులు నిమజ్జనం చేశారు.

భారీ అన్న సమారాధన

గ్రామంలోని గాజులదొడ్డిలో ఉన్న బాలదుర్గా ఆలయం వద్ద శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. కొత్తపల్లి గ్రామం నుంచే కాకుండా, వాకతిప్ప, కుతుకుడుమిల్లి, ఉప్పాడ తదితర గ్రామాల నుంచి సుమారు 2 వేల మంది భక్తులు అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ మంగతాయారు

సామర్లకోట: జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెద్దాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అన్నారు. పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. పెద్దాపురం మున్సిపల్ పార్కులోని గాంధీ విగ్రహానికి చైర్‌పర్సన్‌తో పాటు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ నివాళులర్పించారు. సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి మున్సిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవి, కమిషనర్ ఎ.శ్రీవిద్య నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక గాంధీచౌక్‌లో గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శ్రద్ధాంజలి ఘటించారు. రైల్వే స్టేషన్ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ రవికాంత్ పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, పలువురు వర్తకులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.భైరవమూర్తి, సిబ్బంది శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో గాంధీ విగ్రహానికి రైల్వే స్టేషన్ మేనేజర్ తదితరుల నివాళులు


పెద్దాపురం మున్సిపల్ పార్కులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ తదితరులు

ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి

కొత్తపల్లి: మండలంలో జాతిపిత మహాత్మా గాంధీ, దివంగత ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కొత్తపల్లి సబ్‌స్టేషన్‌లో ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. వాకతిప్ప సచివాలయంలో సర్పంచ్ పాలాని దొరబాబు ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.


సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి చైర్‌పర్సన్, కమిషనర్ నివాళులు


సామర్లకోట ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి ఎంపీపీ తదితరుల శ్రద్ధాంజలి


కొత్తపల్లి సబ్ స్టేషన్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉద్యోగులు